
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
శనివారం 3 మే 2025

ఉష్ణోగ్రత
గరిష్ఠం 41.8
కనిష్ఠం 19.3

రామానుజాచార్యులు ఆదర్శం

» పేదలకు ఆధ్యాత్మిక మార్గం చూపిన వ్యక్తి
» గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



గవర్నర్‌కు రామానుజాచార్యుల ప్రతిమను బహూకరిస్తున్న చిన జీయర్‌స్వామి

శంషాబాద్ రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): పేదలకు, నిమ్నవర్గాలకు ఆధ్యాత్మిక మార్గం చూపడంలో శ్రీ రామానుజాచార్యులు అందరికీ ఆదర్శమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ ముచ్చింతల్ సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో రామానుజాచార్యుల 1008 జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. గురువారం రాత్రి కేంద్రానికి చేరుకున్న గవర్నర్‌కు అహోబిల జీయర్‌స్వామి, దేవానాథ జీయర్ స్వామి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వర్ణ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెయ్యి ఏళ్ల క్రితమే పేదలకు, నిమ్న వర్గాలకు ఆధ్యాత్మిక బావన మార్గం చూపించింది రామానుజాచార్యులైతే.. నేటి సమాజంలో అందరూ సమానమే అని చాటి చెబుతున్న చిన జీయర్‌స్వామి మహనీయులని కొనియాడారు. నాటి కాలంలోనే కుల, మత బేధాలను రూపుమాపడానికి ఎంతో కృషి చేశారని, ఈ ఉత్సవాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అంతకు ముందు చిన జీయర్‌స్వామి గవర్నర్‌కు తీర్థ మంగళశాసనములు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతో బిజీ షెడ్యూల్ ఉన్నా రామానుజాచార్యుల జయంతి వేడుకల్లో గవర్నర్ పాల్గొన్నడం సంతోషంగా ఉందన్నారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు రామానుజాచార్యుల ప్రతిమను అందజేశారు. గవర్నర్ రాక కోసం ఏసీపీ శ్రీనివాస్ రావు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అహోబిల జీయర్‌స్వామి, దేవానాథ జీయర్‌స్వామి, మైహోం గ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు, జూపల్లి జగపతిరావు పాల్గొన్నారు.

యాచారంలో వడగండ్ల వాన

యాచారం, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాచారం, కుర్మిద్ద, తాటిపర్తి, నజ్దిక్ సింగారం, అయ్యవారిగూడ తదితర గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. చిన్న పరిమాణంలో వడగండ్లు పడ్డాయి. బారీ ఈదురుగాలుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో పలు గ్రామాల్లో అంధకారం నెలకొంది. వడగండ్ల వానతో వరి పంటలకు నష్టం కలిగిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ముమ్మరంగా వరి కోతలు

పంటపొలాల్లో హార్వెస్టర్ల సందడి

జిల్లా వ్యాప్తంగా వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. ఊరూరా హార్వెస్టర్ల సందడి కనిపిస్తున్నది. కొద్ది రోజులుగా ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతకొచ్చిన పంటను త్వరత్వరగా కోసుకోవాలని రైతులు హార్వెస్టర్ల చుట్టూ తిరుగుతున్నారు. ఇదే అదునుగా భావించిన హార్వెస్టర్ల యజమానులు రేట్లు పెంచేశారు. గంటకు రూ.2,500 నుంచి మూడు వేలకు పెంచారు. పొలంలో తడి ఉంటూ అదనంగా రూ.300 వసూలు చేస్తున్నారు. గతేడాది హార్వెస్టర్ గంటకు రూ.2300 తీసుకున్నారు. పంటను అకాల వర్షాల నుంచి కాపాడుకునేందుకు డబ్బులెక్కువైనా కోయిస్తున్నామని రైతులు చెబుతున్నారు. కోసిన పంటను ఆరబోసి వెంటవెంటనే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు.



ఆమనగల్లులో ధాన్యం కొనుగోళ్లు

- గంటకు రూ.500 పెంచిన యజమానులు
- కొనుగోలు కేంద్రాలకు తరలుతున్న వడ్లు
- అకాల వర్షాలతో రైతన్నల్లో గుబులు
- 'ఇబ్రహీంపట్నం'లో 18,552 ఎకరాల్లో సాగు

యాచారం/ఆమనగల్లు, మే 2(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో యాసంగిలో 18,552 ఎకరాల్లో వరి సాగవుతుండగా పంటలకు సరిపడా నీరందక యాచారం మండలంలో 240 ఎకరాలు, మంచాలలో 150 ఎకరాలు, ఇబ్రహీంపట్నంలో 120 ఎకరాలు ఎండిపోయాయి. ఇటీవల కురిసిన వడగళ్ల వానకు యాచారం మండలంలో 214 ఎకరాల్లో వరి పంట స్వల్పంగా దెబ్బతిన్నది. ఈ ఏడాది వరికోతలకు ముందే నియోజకవర్గంలో పది ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరిచారు. యాచారం మండలంలో యాచారం, నందివనపర్తి, చింతపట్ల,

మిగతా 8వ పేజీలో...

గిడ్డంగి ఏర్పాటు చేయాలి



ధాన్యం నిల్వ చేసుకోవడానికి గిడ్డంగులు లేక ఇబ్బందులు పడుతున్నాం. యాచారం లేదా మాల్‌లో 100 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గిడ్డంగి నిర్మించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఆయా గ్రామాల్లోని వెంచర్లలో పంచాయతీకి కేటాయించిన పది శాతం భూమిలో బారీ గిడ్డంగి తెరిస్తే బాగుంటుంది.

- గుండ్లపల్లి సురేందర్‌రెడ్డి, రైతు, గడ్డమల్లాయగూడ

సమాచారం

అవుట్ సోర్సింగ్‌లో 63 పోస్టులు

రంగారెడ్డి అర్బన్, మే 2(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలంలోని మహేశ్వరం మెడికల్ కాలేజీలో వివిధ కేటగిరీల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో 63 పోస్టులు మంజూరైనట్లు కలెక్టర్ నారాయణరెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ల్యాబ్ అటెండర్లు 13, రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్ 4, ఓటీ టెక్నీషియన్లు 4, అనస్తీషియా 4, బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ 4, వార్డు బాయ్స్ 4, దోబి/ప్యాకర్ 3, ఎలక్ట్రీషియన్ 3, మంగలి 3, ప్లంబర్ 2, థియేటర్ అసిస్టెంట్ 6, గ్యాస్ ఆపరేటర్ 2, ఈసీజీ టెక్నీషియన్ 3, ఆప్టీషియన్, దంత సాంకేతిక నిపుణుడు, రికార్డు క్లర్క్/రికార్డు అసిస్టెంట్, కేటలాగుర్, మ్యూజియం అసిస్టెంట్ కమ్ ఆర్టిస్ట్, ఆడియో విజువల్ టెక్నీషియన్, వడ్రంగి, దర్జీ ఒక్కో పోస్టు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. పోస్టును బట్టి రూ.15,600 నుంచి రూ. 22,750 వరకు నెలసరి వేతనం ఉంటుందని, ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

'బాల పురస్కార్'కు దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డి అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన పిల్లలకు ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్‌పురస్కార్(పీఎంఆర్బీపీ) చిల్డ్రన్ అవార్డ్ భర్తీ చేసేందుకు అర్హుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా శిశుసంక్షేమాధికారి శ్రీలత శుక్రవారం ప్రకటనలో తెలిపారు. క్రీడలు, నూతన ఆవిష్కరణ, సామాజిక సేవ, పర్యావరణం, సామాజిక కళలు, సంస్కృతి, సైన్స్ అండ్ టెక్నాలజీలో ప్రతిభ చాటిన 5 నుంచి 18 సంవత్సరాల మధ్య వారు అవార్డులకు అర్హులని, జూలై 31లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సివిల్స్‌కు ఉచిత శిక్షణ

రంగారెడ్డి అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. విద్యార్థి తండ్రి వార్షిక ఆదాయం రూ.5 లక్షల లోపు ఉండాలని, అభ్యర్థుల ఎంపికలో రిజర్వేషన్ నియమం అమలులో ఉంటుందన్నారు. స్క్రీనింగ్ టెస్టు జూన్ 5వ తేదీన ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 24 వరకు ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 040-23236112 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నిరుపయోగంగా డంప్‌యార్డులు

చెత్త నుంచి సంపద తయారీలో నిర్లక్ష్యం

మద్యంప్రియులకు అడ్డాగా మారిన వైనం.. పట్టించుకోని అధికారులు, పాలకులు

నందిగామ, మే 2(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్మించిన డంపింగ్ యార్డులు అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారాయి. గత ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూర్చాలనే ఉద్దేశంతో శివారుల్లో కంపోస్ట్‌యార్డులు నిర్మించింది. ఇళ్ల నుంచి సేకరించిన చెత్తతో కంపోస్ట్ ఎరువు తయారుచేసి, దానిని విక్రయించడం ద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వినియోగించాలనే సంకల్పంతో రూ.లక్షలు వెచ్చించి డంపింగ్ యార్డులు నిర్మించింది. అధికారులు నిర్వహణను గాలికి వదిలేయడంతో అవి శిథిలావస్థలకు చేరుకొని మందుబాబులకు అడ్డాగా మారాయి.

18 గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు

నందిగామ మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో ప్లాన్ 1, ప్లాన్ 2 ప్రకారం కంపోస్ట్‌యార్డులు నిర్మించారు. అందులో ఒకటి రెండు

మిగతా 8వ పేజీలో...

నందిగామలో నిరుపయోగంగా డంప్‌యార్డు



వినియోగంలోకి తేవాలి



గ్రామంలో సేకరించిన తడి చెత్తతో వర్మీ కంపోస్ట్ తయారు చేస్తే రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది. చెత్తతో చేసిన ఎరువులో ఎలాంటి రసాయనాలు ఉండవు. తక్కువ ధరలో రైతులకు అందుబాటులో ఉంటుంది. అధికారులు ఇప్పటికైనా చెత్తతో ఎరువును తయారు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలి. డంపింగ్ యార్డులను వినియోగంలోకి తేవాలి.

- మురళి, రైతు, పిట్టలగూడ

ఆవులను తరలిస్తున్న కంటైనర్ పట్టివేత

ఇబ్రహీంపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయపోల్ రోడ్డులో జనహర్ష ఫాం ల్యాండ్స్ వద్ద గురువారం అర్ధరాత్రి సమయంలో ఓ కంటైనర్‌లో అక్రమంగా కబేళాకు తరలిస్తున్న 42 ఆవులు, కోడె దూడలను హిందూ సంఘాలు, బీజేపీ నాయకులు పట్టుకున్నారు. పోలీసుల సమక్షంలో తట్టిఖానా గోశాలకు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. ఓ కంటైనర్‌లో హైదరాబాద్ శివారులోని కబేళాకు అక్రమంగా ఆవులు తరలిస్తున్నారనే సమాచారం మేరకు గురువారం రాత్రి పలువురు బీజేపీ, హిందూ సంఘాల నాయకులు రాయపోల్ రోడ్డులో కంటైనర్‌ను అడ్డుకున్నారు. పోలీసులకు సమాచారం అందించి ఈ కంటైనర్‌ను ఇబ్రహీంపట్నం తీసుకువస్తున్న తరుణంలో కంటైనర్ డ్రైవర్ దిగి పరారయ్యాడు. దీంతో కంటైనర్‌ను నేరుగా తట్టిఖానాలోని గోశాలకు తరలించారు. ఈ కంటైనర్‌లో 18 ఆవులు, 24 కోడె దూడలు, ఎద్దులు ఉన్నాయి. ప్రయాణంలో ఒత్తిడి మూలంగా ఓ ఆవు మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ జగదీశ్ తెలిపారు. కంటైనర్‌ను పట్టుకున్న వారిలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాల మహేందర్, హిందూ సంఘాల నాయకులు ఆడెపు రాఘవేందర్, విజయ్‌కుమార్, శశిధర్‌రెడ్డి, అర్జున్, సతీష్, ఇబ్రహీం తదితరులున్నారు.



ఆర్టీసీ సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీజేఎంయూ నాయకులు

సీఎం స్పందించకపోతే సమ్మె తప్పదు

టీజేఎంయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వాములయ్య

షాద్‌నగర్ అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల డిమాండ్లపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించకుంటే సమ్మె తప్పదని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వాములయ్య తెలిపారు. షాద్‌నగర్ ఆర్టీసీ డిపో ఆవరణలో శుక్రవారం ఆర్టీసీ సమ్మె వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యలను పలుమార్లు ప్రభుత్వానికి చెప్పామని, ప్రభుత్వం నుంచి సరైన హామీ లేకపోవడంతో ఈనెల 7న సమ్మె చేయాలని నిర్ణయించామని తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందన్న ఆశ ఉందన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేయాలని, గుర్తింపు సంఘాల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. 2017 వేతన సవరణ బకాయిలు చెల్లించాలని, కొత్త అలవెన్స్‌లు అమలు చేయాలని, రిటైరైన ఉద్యోగులకు 2017 వేతన సవరణ జరిపి, అన్ని బకాయిలు చెల్లించాలని కోరారు. 2021, 2025 వేతన సవరణలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని 19 డిమాండ్లను ప్రభుత్వం వద్ద పెట్టామని తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే నిరవధిక సమ్మెకు యూనియన్లకు అతీతంగా ఆర్టీసీ కార్మికులందరు కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ నాయకులు నర్సింహులు, ధన్‌సింగ్, టీవీరెడ్డి, స్వామి, మల్లయ్య, పర్వతాలు, శ్యామల, అంజనేయులు, టాకేశ్వర్‌రావు, చిట్టి, ప్రహ్లాద్, కళ్యాణి, ప్రభావతి పాల్గొన్నారు.



క్రీడా ప్రాంగణాన్ని పట్టించుకోరా?

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వ హయాంలో క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేశారు. మొయినాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించిన క్రీడా మైదానాలు నిరుపయోగంగా మారాయి. చెట్లు, పొదలతో అడవిని తలపిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో అయితే గ్రామాలకు దూరంగా క్రీడాప్రాంగణాలను నిర్మించడంతో ఎవరూ పట్టించుకోక కళావిహీనంగా మారాయి. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని చిలుకూరు వార్డులో గ్రామానికి దూరంగా నిర్మించిన క్రీడా మైదానం ఇలా చెట్లు, పొదలతో నిండిపోయింది.

- మొయినాబాద్ రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి)

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): వడగండ్ల వానకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం చిల్కమర్రి, బూర్గుల, రమ్మదనం, గంట్లవెల్లి, చింతగూడ గ్రామాల్లో గురువారం రాత్రి కురిసిన వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను శుక్రవారం ఉదయం వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. చిల్కమర్రిలో యాదయ్య వరి పంటను పరిశీలించిన ఆయన అక్కడే రైతులతో మాట్లాడారు. ఎన్ని ఎకరాల్లో పంటలకు నష్టం జరిగిందనే వివరాలను అధికారులు సేకరిస్తారని తెలిపారు. ఆ నివేదిక ఆధారంగా రైతులకు పరిహారం అందుతుందని పేర్కొన్నారు. మండలంలోని చిల్కమర్రి, బూర్గుల, రమ్మదనం, గంట్లవెల్లి, చింతగూడ గ్రామాల్లో వడగండ్ల వానకు పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. 540 ఎకరాల్లో వరి, 24 ఎకరాల్లో మామిడి, ఐదెకరాల్లో కూరగాయ పంటలు దెబ్బతిన్నాయని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. 659 మంది రైతులకు నష్టం జరిగినట్లు తెలిపారు. ఆయనవెంట ఏడీఏ రాజారత్నం, ఏవో నిషాంత్‌కుమార్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, విశ్వం, చెన్నయ్య ఉన్నారు.



చిల్కమర్రిలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

వామ్మో.. భారీ ట్రాన్స్‌ఫార్మర్!

తాండూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణం మీదుగా ఓ పెద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను కంటైనర్‌లో ఉంచి తరలించారు. మహారాష్ట్రలోని సొలాపూర్‌లో తయారు చేసిన ఈపెద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను కంపెనీలకు తరలిస్తున్నారు. ఇంత పెద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎప్పుడు చూడని జనం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తాండూరు పట్టణ శివారు శివాజీ చౌక్ నుంచి ఇందిరాచౌక్, బస్టాండ్ నుంచి ఈ కంటైనర్ వెళ్లింది. సుమారు 64 హైడ్రాలిక్ టైర్లతో ఈ పెద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను చెన్నైలోని ఓ కంపెనీకి తరలిస్తున్నట్లు సమాచారం. దీన్ని తరలించే క్రమంలో పట్టణంలో విద్యుత్ వైర్లు అడ్డుతగలకుండా స్థానిక విద్యుత్ అధికారులు చర్యలు చేపట్టారు



తాండూరు మీదుగా వెళ్తున్న భారీ ట్రాన్స్‌ఫార్మర్

వక్ఫ్ సవరణ బిల్లుపై నిరసన

కొడంగల్, తాండూరులో నల్లజెండాలతో ముస్లింల ర్యాలీలు

కొడంగల్, మే 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ కొడంగల్‌లో ముస్లింలు నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక వినాయక చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు శుక్రవారం స్థానిక జామే మస్జీద్ కమిటీ అధ్యక్షుడు అఫ్రోజ్, మైనారిటీ నాయకులు ఎస్ బీ.గుల్షన్, హాఫీజ్ ఎండీ.యూసుఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో హాఫీజ్ అబ్దుల్ కరీం, బాసిత్, నసీర్, అఫ్రోజ్‌ఖాన్, షేక్ రుమాన్, ఎండీ.సర్తాజ్‌హుసేన్, ఎండీ.షాకీర్, ఎకే. యూసుఫ్, అజ్మీర్‌ఖాన్ పాల్గొన్నారు.



కొడంగల్ ర్యాలీలో ముస్లింలు

తాండూరు: వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకొని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తాండూరు పట్టణంలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ముస్లిం సంఘాల కన్వీనర్ కమల్తార్ జమాత్ ఏ అహ్లే హదీస్, జమాతుల్ ఓలుమా, జమతే ఇస్లామి హింద్ సంఘాల ఆధ్వర్యంలో కేంద్రం తీసుకు వచ్చిన వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ నల్ల జెండాలతో నిరసన ర్యాలీ చేపట్టారు. ముస్లింల అస్తిత్వాన్ని దెబ్బతీసేలా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ బిల్లును వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఆలీం, రాజకీయ నాయకులు అబ్దుల్ రవూఫ్, అప్పు (నయీం), నాయకులు పాల్గొన్నారు.



తాండూరులో...



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్‌లో ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్

- జాతీయ రహదారిపై బ్రిడ్జి, మూడు అండర్ పాస్‌లు

ఘట్‌కేసర్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఘట్‌కేసర్ మండలంలోని హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు తీరనున్నాయి. ఈ రహదారిపై ఒక బ్రిడ్జి, మూడు అండర్ పాస్‌ల నిర్మాణానికి సాంకేతిక అనుమతులను సాధించినట్లు బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఘట్‌కేసర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై వాహనాల రద్దీతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈసమస్య పరిష్కారానికి అనేక సార్లు ఎంపీలు డాక్టర్ కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్‌ల సహకారంతో జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కలిసి సమస్యలను వివరించినట్లు గుర్తుచేశారు. ఘట్‌కేసర్ ఔటర్ జంక్షన్ వద్ద బ్రిడ్జితోపాటు, మైసమ్మగుట్ట కాలనీకి వెళ్లేందుకు భూగర్భవంతెన, ఎన్‌టీపీసీ చౌరస్తా, అంకుషాపూర్ చౌరస్తాలోనూ భూగర్భ వంతెనల నిర్మాణాలకు అనుమతితో పాటు రూ.102కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈనెల 5న నగరంలోని అంబర్‌పేట్‌లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపనలు చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మహిపాల్ రెడ్డి, బాల్ నర్సింహా, మధుసుదన్‌రెడ్డి, శ్రీధర్, అనిల్, పవన్‌సింగ్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి విజేతకు కన్సొలేషన్ బహుమతి

శంషాబాద్, మే 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్ పోటీలో పాల్గొన్న వారికి కన్సొలేషన్ బహుమతిని శుక్రవారం ప్రదానం చేశారు. ఈమేరకు శంషాబాద్ డివిజన్‌కు చెందిన టి.పార్థివ్‌కృష్ణ ప్రత్యేక బహుమతి గెలుచుకున్నారు. ఆయనకు ఆయన పనిచేసే కార్యాలయంలో కన్సొలేషన్ బహుమతిని సర్క్యులేషన్ సిబ్బంది, స్థానిక జర్నలిస్టులు అందజేశారు. జర్నలిస్టులు దూడల కృష్ణగౌడ్, మైత్రి ఆంజనేయులు ఏసీవో టి.అశోక్. ఆంధ్రజ్యోతి ఏజెంట్ ఎం.చంద్రశేఖర్ పాల్గొన్నారు.



పార్థివ్‌కృష్ణకు బహుమతి అందిస్తున్న ఆంధ్రజ్యోతి సిబ్బంది

ఘనంగా రామానుజాచార్యుల జయంతి

శంషాబాద్ రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): ముచ్చింతల్ సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో భగవత్ శ్రీ రామానుజాచార్యుల 1008 జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో అర్ధ నక్షత్ర రోజున ఉదయం తెల్లవారుజామున స్వర్ణ విగ్రహానికి అభిషేకం నిర్వహించారు. 108 దివ్య దేశాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు వేద పండితులు, రామానుజాచార్యుల జయంతి వేడుకల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. జయంతి వేడుకల సందర్భంగా భక్తులకు ఉచిత దర్శనాలకు అనుమతించారు. సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన జీయర్‌స్వామి ఆలయ ప్రారంభం నుంచి నేటి వరకు ఎప్పుడు ఉచిత దర్శనాలకు అనుమతి ఇవ్వలేదు. కానీ, భవత్ రామానుజాచార్యుల జయంతి వేడుకల్లో భక్తులకు ఉచిత దర్శనాలకు అనుమతిచ్చారు. అనంతరం చిన జీయర్‌స్వామి మాట్లాడుతూ.. వెయ్యేళ్ల కిందటే రామానుజాచార్యుల వారు కుల, మతాలను రూపుమాపడానికి ఎంతో కృషి చేశారని చెప్పారు. మనుషుల సమానత్వం కోసం కృషి చేశారని చెప్పారు. డబ్బు వాయిద్యాలతో గిరిజనులు నృత్యాలు చేశారు. ఉత్తమ కళాకారులకు సర్టిఫికెట్లు, మంగళశాసనములు అందించారు. ఉచిత దర్శనం ఇవ్వడంతో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో స్వర్ణ విగ్రహానికి, 108 దివ్య దేశాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అహోబిల జీయర్‌స్వామి, దేవానాథ జీయర్‌స్వామి, మైహోం గ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వర్ రావు దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో స్వర్ణ విగ్రహానికి ప్రత్యేక పూజలు





అంజయ్యకు సమ్మె నోటీసు ఇస్తున్న పెంటయ్య తదితరులు

సమ్మె నోటీస్ అందజేత

తలకొండపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వపు కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య తెలిపారు. మోదీ సర్కార్ పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థల కొమ్ము కాస్తూ కార్మికులను శ్రమ దోపిడీకి గురిచేస్తుందని ఆరోపించారు. తలకొండపల్లి మండల కేంద్రంలో శుక్రవారం సమ్మె సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమనగల్లు డివిజన్ రైస్‌మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మిట్టపల్లి అంజయ్యకు కార్మికులతో కలిసి సమ్మె నోటీసు అందజేశారు. మిల్లర్లు సహకరించాలని పెంటయ్య కోరారు. కనీస వేతనం రూ.26 వేలు అందించాలని, కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న భీంభరత్

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి : భీంభరత్

షాబాద్, మే 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమని పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ తెలిపారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని పోతుగల్ గ్రామంలో రూ.10లక్షల నిధులతో చేపట్టే సీసీ రోడ్డు పనులను ఆయన నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పామెన నర్సింలు, చెన్నయ్య, మాజీ సర్పంచ్‌లు బుచ్చయ్య, నాయకులు భార్గవ్‌రామ్, రాజు, యాదయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు



మాట్లాడుతున్న గంప వెంకటేశ్

ఆమనగల్లు, మే 2(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు. ఆమనగల్లు పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో వెంకటేశ్ మాట్లాడుతూ కడ్తాల, ముద్విన్‌లో ఈనెల 5న(సోమవారం) జిల్లా పౌరసరఫరాల శాఖ సహకారంతో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు చెప్పారు. వానా కాలం పంటల సాగుకు అర్హులైన రైతులందరికీ పీఏసీఎస్ ద్వారా పంటరుణాలు అందించడానికి కార్యాచరణ రూపొందించినట్లు వెల్లడించారు. అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. సమావేశంలో పీఏసీఎస్ వైస్‌చైర్మన్ సత్యం, డైరెక్టర్ జోగు వీరయ్య, సీఈవో దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

లింగమ్మ మృతి పట్ల ఎమ్మెల్యే సంతాపం

ఆమనగల్లు, మే 2(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మాజీ వైస్ ఎంపీపీ, కాంగ్రెస్ నాయకుడు నిట్ట నారాయణ మాతృమూర్తి లింగమ్మ మృతిపట్ల ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారిలు సంతాపం ప్రకటించారు. అనారోగ్యంతో మృతిచెందిన లింగమ్మ మృతదేహాన్ని శుక్రవారం వారు వేర్వేరుగా సందర్శించి నివాళులర్పించారు. నిట్ట నారాయణ, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ జడ్పీటీసీలు అనురాధ పత్యానాయక్, కండె హరిప్రసాద్, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు మండ్లీ రాములు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, పట్టణాధ్యక్షుడు మానయ్య, బీజేపీ అధ్యక్షులు ఎర్రవోలు శ్రీను, విక్రమ్‌రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

వార సంత.. సమస్యలే అంతా

బషీరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రతీ మంగళవారం జరిగే వార సంతలో సమస్యలు తప్పడంలేదు. సంత వేలం ద్వారా గ్రామ పంచాయతీకి ఏటా రూ.లక్షల ఆదాయం వస్తున్నా సంతలో కనీస సౌకర్యాలు కల్పించడంతో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మౌలిక వసతులు లేక చిరు వ్యాపారులు, కొనుగోలుదారులు సంతలో ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపైనే సంత నిర్వహిస్తుండటంతో ప్రధాన, అంతర్గత రోడ్లన్నీ ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఎదురవుతోంది. వర్షంకాలం ఈ సంతలో సమస్య మరింత తీవ్రంగా మారుతోంది. తైబజార్ ట్యాక్స్‌ను వసూళ్లు చేస్తున్న సంతలో సౌకర్యాలు మాత్రం కల్పించడంలేదని వ్యాపారులు వాపోతున్నారు. గ్రామ పంచాయతీ, మండల అధికారులకు ఇదంతా తెలిసినా ఎవరూ పట్టించుకోవడంలేదని వ్యాపారులు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డుపైనే బషీరాబాద్ సంత

పాడిరైతులకు బాసట..
పశువుల షెడ్ల నిర్మాణం

- చేవెళ్ల మండలానికి 20 మంజూరు
- 13 షెడ్ల నిర్మాణం పూర్తి.. ఒక్కోదానికి రూ.80 వేల ఖర్చు

చేవెళ్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు ప్రభుత్వం బాసటగా నిలుస్తోంది. ఐదు ఎకరాలలోపు వ్యవసాయ భూములు ఉండి ఉపాధిహామీ జాబ్‌కార్డు కలిగి ఉన్న సన్న, చిన్నకారు రైతులకు ప్రభుత్వం పశువుల కొట్టాలు మంజూరు చేసింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వంద శాతం సబ్సిడీతో పశువుల కొట్టాలు మంజూరు చేసింది. ఇందులో భాగంగా చేవెళ్ల మండలానికి 2024-25 సంవత్సరానికి 20 పశువుల పాకలు మంజూరయితే.. 13 షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగతా షెడ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. మండలంలో 29 గ్రామ పంచాయతీల పరిధిలో గత మూడు నెలలుగా షెడ్ల నిర్మాణ పనులు సాగుతున్నాయి.



మల్లారెడ్డిగూడలో నిర్మించిన పశువుల షెడ్డు



కమ్మెట గ్రామంలో నిర్మించిన పశువుల షెడ్డు

ఒక్కో షెడ్డుకు రూ.80 వేలు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాలుగు పశువులు ఉన్న వారికి షెడ్డును మంజూరు చేస్తారు. ఒక్కో షెడ్డుకు రూ.80 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. రూ.30 వేలు లేబర్ ఖర్చు పోగా.. రూ.50 వేలు మెటీరియల్‌కు ఇస్తున్నారు. 18 అడుగుల పొడవు, 15 అడుగుల వెడల్పుతో షెడ్డు నిర్మాణం చేపడుతున్నారు. ఇప్పటి వరకు మండలం వ్యాప్తంగా షెడ్డు నిర్మించుకున్న లబ్ధిదారులకు నిధులు మంజూరు చేశారు. ప్రభుత్వ నిర్ణయించిన కొలతల ప్రకారమే కొట్టాల నిర్మాణాలు చేపట్టాలని అధికారులు సూచిస్తున్నారు. ఈమేరకు పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

రైతులకు ఎంతో ఉపయోగం



పశువుల షెడ్లు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. చేవెళ్ల మండలంలో పశువుల షెడ్లు నిర్మించుకున్న రైతులందరికీ బిల్లులు చెల్లించాం. ఇప్పటివరకు 13 నిర్మాణాలు పూర్తయ్యాయి. అర్హత, అవసరం ఉన్న రైతులను గుర్తించి యూనిట్ మంజూరు చేస్తాం. షెడ్డు నిర్మించుకునేందుకు సొంత స్థలం ఉంటే చాలు. ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారమే షెడ్లు నిర్మించుకోవాలి.

- హిమబిందు, ఎంపీడీవో, చేవెళ్ల

షెడ్డు నిర్మాణం సంతోషకరం



మాకు షెడ్డు నిర్మించేందుకు యూనిట్ మంజూరు కావడం సంతోషంగా ఉంది. ఉపాధిహామీ పథకం ద్వారా పశువుల షెడ్డు మంజూరైంది. అధికారులు సూచించిన కొలతల ప్రకారం నిర్మించుకున్నాం. మా పశువులను కట్టివేసుకునేందుకు షెడ్డు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఈ పథకంతో పేదలకు ఎంతో మేలు జరుగుతుంది.

- మల్గారి రాజేందర్‌రెడ్డి, మల్లారెడ్డిగూడ

సిబిల్ స్కోర్ బాగుంటేనే రుణాలు

» రాజీవ్ యువ వికాస్ రుణాలపై బ్యాంకర్లతో అధికారుల సమీక్ష



రాజీవ్ యువ వికాస్ రుణాలపై బ్యాంకర్లతో సమీక్షిస్తున్న ఎంపీడీవో విశ్వప్రసాద్

తాండూరు రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): సిబిల్ స్కోర్ ఆధారంగా అర్హులకే రాజీవ్ యువ వికాస్ రుణాలు అందిస్తామని బ్యాంకు అధికారులు తెలిపారు. తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రాజీవ్ యువ వికాస్ రుణాల పథకం రుణాల అందజేతపై బ్యాంకర్లతో ఎంపీడీవో విశ్వప్రసాద్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ 1251, ఎస్సీ కార్పొరేషన్ కింద 548, ఎస్టీ కార్పొరేషన్ కింద 112, మైనార్టీ కార్పొరేషన్ 240, ఎంబీసీ కింద 21, ఈబీసీ కింద 37 దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. అయితే వీటిలో బ్యాంకర్స్ కమిటీ అధ్యక్షతన సిబిల్ స్కోర్ ఆధారంగా వారి అర్హతను బట్టి ఎంపిక చేయనున్నట్లు బ్యాంకు అధికారుల బృందం సమీక్షలో నిర్ధారించారు. బ్యాంకర్స్ కమిటీలో ఎంపీడీవోతోపాటు డీఆర్‌డీఏ ప్రతినిధులు, అధికారులు దరఖాస్తులను సెలెక్షన్ కమిటీ తుది నిర్ణయం మేరకు యూనిట్లను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకర్స్ కమిటీ ప్రతినిధులు, ఎస్‌బీఐ బ్యాంకు ప్రతినిధి శ్రావణి, గ్రామీణ బ్యాంకు రాజేష్, ఎస్‌బీఐ కరన్‌కోట్ పురుషోత్తం, యూనియన్ బ్యాంకు ప్రతినిధి చేతన్, మండల పంచాయతీ అధికారి సునిల్ కుమార్ పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన

తాండూరు మండలంలోని ఆయా గ్రామాల నుంచి రాజీవ్ యువ వికాస్ పథకానికి 2219 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో విశ్వప్రసాద్, మండల పంచాయతీ అధికారి సునిల్‌కుమార్‌లు తెలిపారు. అట్టి దరఖాస్తులను శుక్రవారం తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో కులం, ఆదాయం, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు బాలకృష్ణ, సత్యానారాయణరెడ్డి, రవి, నర్సిరెడ్డి, వీరప్ప తదితరులున్నారు.

కులగణన ఘనత రాహుల్‌దే



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి

మేడ్చల్ టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర క్యాబినెట్ జనగణనతో పాటు కులగణన చేయాలని తీర్మానించడం రాహుల్ గాంధీ నిర్వహించిన జోడో యాత్ర విజయమని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేయాలని కేంద్రం ప్రకటించటం హర్షణీయమన్నారు. కులగణన కోసం రాహుల్ గాంధీ అన్ని రాష్ట్రాల్లో నిర్వహించిన జోడోయాత్రలో ముందే చెప్పారని ఆయన గుర్తుచేశారు. రాహుల్ గాంధీ మాట ప్రకారం తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి కులగణన చేసి దేశానికి రోల్‌మోడల్‌గా నిలిచారని కొనియాడారు. బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్‌కు ఎక్కడ ఘనత తగ్గుతుందోనన్న అక్కసుతో హడావిడిగా ప్రకటనలు చేశారని విమర్శించారు. తెలంగాణను మోడల్‌గా తీసుకుని కేంద్రం అన్ని రాష్ట్రాల్లో వీలైనంత త్వరగా కులగణన సర్వే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేముల శ్రీనివాస్‌రెడ్డి, పోచయ్య, నాగభూషణం, రమేష్, మహేష్, మల్లేష్‌గౌడ్, కొండల్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, రాజు, సత్యనారాయణ, శంకర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన

కొత్తూర్, మే 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎస్‌బీ పల్లిలోని బీరప్ప స్వామి దేవాలయం పునర్నిర్మాణం, బీరప్ప ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మొదటి ఘట్టం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలతో బీరప్ప కామరాతిదేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఉప ఆలయాలకు చెందిన మహంకాళి, బుగ్గ పోచమ్మ విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ నిర్వహించారు. ఆలయం ముఖద్వారం వద్ద ఏకశిల ధ్వజస్తంభం, గర్భాలయ గోపురాలపై శిఖర కలశాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కురుమ కులస్తుల ఆధ్వర్యంలో యజ్ఞ క్రతువు నిర్వహించారు. పూజా కార్యక్రమం అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు వేలాదిగా తరలివచ్చారు. కొత్తూర్ మాజీ జడ్పీటీసీ ఎమ్మె శ్రీలతా సత్యనారాయణ, నాయకులు కడాల శ్రీశైలం, వెంకటయ్య, అజయ్, పాండు, బాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపనలో ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, భక్తులు

చిన్నగ్రామాల అభివృద్ధి కృషి



గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): చిన్న గ్రామ పంచాయతీల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడిన బొట్టిగూడ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం గ్రామ పంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. చిన్న గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో 500 ఓట్లు ఉన్న వాటిని పంచాయతీలుగా మార్చుతున్నామని చెప్పారు. ఇంతకుముందు రామంజాపూర్ అనుబంధ గ్రామంగా ఉన్న బొట్టిగూడను నూతన పంచాయతీగా ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఏళ్ల నుంచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దృష్టికి రాగానే ప్రపోజల్స్ పంపి నూతన జీపీగా ఏర్పాటు చేశామని చెప్పారు. గ్రామాభివృద్ధికి అందరూ కలిసి కట్టుగా పనిచేసి వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని సర్పంచ్‌గా ఏకగ్రీవం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాజీ జడ్పీటీసీ తన్వీరాజు, పీఏసీఎస్ చైర్మన్ దౌనకర్‌గౌడ్, వైస్ చైర్మన్ ప్రభుసాగర్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ విశాల

కాంగ్రెస్‌తోనే సంక్షేమం

చౌదరిగూడ, మే 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని కేశంపేట మాజీ జడ్పీటీసీ విశాలా శ్రవణ్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షురాలు పిట్ల రజితలు అన్నారు. శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు. త్వరలో మండలంలో నిర్వహించనున్న జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చలివేంద్రపల్లి రాజు, మాజీ ఎంపీటీసీ కొమ్ము కృష్ణ, బీసీ సెల్ తాలూకా అధ్యక్షుడు చంద్రశేఖర్, ఎఎంసీ డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, సలీం, భాస్కర్, బాల్‌రాజ్, పాపయ్య, నర్సింలు, అజ్జు, హసన్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఫ్రీజర్

» పట్టించుకోని అధికారులు



కీసర, మే 2 (ఆంధ్రజ్యోతి): ఫ్రీజర్ బాక్స్ చెడిపోయి రోజులు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోవడం లేదు. కొంతకాలం కిందట మాజీమంత్రి, స్థానిక మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తన సొంత నిధులతో అంత్యక్రియలకు నిధులు సమకూర్చారు. మండలంలోని ప్రతీ గ్రామంలో ఎవరైనా మృతిచెందితే భౌతికకాయాన్ని తరలించేందుకు వాహనం, మృతదేహం రాత్రిళ్లు నిల్వ చేసేందుకు ఫ్రీజర్లను విరాళంగా అందజేశారు. అందులో భాగంగానే కీసరకు కూడా ఒక వాహనం, ఫ్రీజర్ విరాళంగా ఇచ్చారు. అయితే కొన్ని రోజులుగా ఫ్రీజర్ చెడిపోయి మూలన పడింది. దీంతో గ్రామంలో ఎవ్వరైనా రాత్రి సమయంలో మృతి చెంది, మృతదేహాన్ని నిల్వచేయాలంటే ఖర్చుతో కూడుకున్న పని అవుతోంది. ఇటీవల కీసరకు చెందిన ప్రజాప్రతినిధి సతీమణి కాలం చేసే, ప్రైవేట్ ద్వారా ఫ్రీజర్‌ను ఉపయోగించాల్సి వస్తోందని గ్రామస్తులు తెలిపారు. దమ్మాయిగూడ మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. నిరుపేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉండే ఈ ఫ్రీజర్‌కు మరమ్మతులు చేసి, ఉపయోగంలోని తీసుకురావాలని అధికారులను కోరుతున్నారు.

తెలంగాణలో సైనిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలి

కీసర రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణాలో సైనిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని క్రాంతి కీన్ ఫౌండేషన్ జాయింట్ సెక్రటరీ కళ్యాణి డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని విద్యార్థులకు కోరుకొండ, కలికిరి సైనిక్ స్కూల్స్‌లో హోమ్ స్టేట్ కోటా ప్రవేశాలను రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఆమె శుక్రవారం కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర మంత్రుకు, ఎంపీలకు ఓ బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణాలోని విద్యార్థులకు హోమ్ స్టేట్ కోటా కింద ఆంధ్రప్రదేశ్‌లోని కోరుకొండ, కలికిరి సైనిక్ స్కూల్స్‌లో ప్రవేశాలు కల్పించేవారని, ఆకస్మాత్తుగా ఈ కోటాను రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటంతో వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా 2025-26 విద్యా సంవత్సరానికి ఇప్పటికే పరీక్షలు రాసిన విద్యార్థులకు నాన్‌లోకల్ నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- శంషాబాద్ ట్రాఫిక్ సీఐ ప్రమోద్ కుమార్



శంషాబాద్, మే 2(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ ఆర్జీఐఏ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ట్రాఫిక్ సీఐ బి.ప్రమోద్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు పంచుకున్నారు.

ప్రశ్న : రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

జవాబు: జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి బ్లాక్ స్పాట్లు, మూలమలుపుల వద్ద రేడియం స్టిక్కర్లు, బారికేడ్లు, బోలార్డ్స్ ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న : శంషాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లోకి కొన్ని ప్రాంతాలకు చెందిన బస్సులు మాత్రమే వెళ్తున్నాయి. ఇతర ప్రాంతాల బస్సులు పరిస్థితేంటి?

జవాబు: ఈ విషయం మా దృష్టికి వచ్చింది. త్వరలో ఆర్టీసీ అధికారులతో మాట్లాడి తదుపరి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : బస్టాండ్, ఇతర ప్రాంతాల్లో కొత్త, పాత హోటళ్ల ఎదుట పార్కింగ్ సౌకర్యం సరిగా లేదు కదా?

జవాబు: హోటల్ యజమానులకు పార్కింగ్ సౌకర్యం చూసుకోవాలని నోటీసులిస్తున్నాం. అనుమతి లేకున్నా పార్కింగ్ చేస్తున్న వాహనదారులపై చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న : డ్రంకెన్ డ్రైవ్, అతివేగంపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారా?

జవాబు : మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, అతివేగంతో ప్రమాదాలు చోటుచేసుకుంటాయని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని వాహనదారులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని చెబుతున్నాం. అదేవిధంగా ప్రతిఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అవగాహన కల్పిస్తున్నాం.

రోడ్డు ఇలా.. ప్రయాణమెలా?

- కంకర తేలిన ఎక్వాయిపల్లి-చరికొండ రోడ్డు
- నిధులు మంజూరైనా విడుదల కాని వైనం
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు



కంకర తేలిన ఎక్వాయిపల్లి- చరికొండ రోడ్డు

కడ్తాల్, మే 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎక్వాయిపల్లి-చరికొండ బీటీ రోడ్డు నరకప్రాయంగా మారింది. బీటీ కొట్టుకుపోయి అడుగడుగునా కంకరతేలి గోతులేర్పడింది. పంచాయతీ రాజ్ శాఖ ఆధీనంలోని ఈ రోడ్డు పూర్తిగా పాడై ప్రయాణికులు, వాహనదారులు ఏళ్లకాలంగా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేక చోట్ల రోడ్డు దెబ్బతిని, గోతులతో ప్రయాణికులు ప్రమాదాలకు లోనవుతున్నారు. మూడు మండలాలను కలిపే సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించాలని చాలా కాలంగా ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కడ్తాల్, మాడ్గుల్, యాచారం మండలాలకు చెందిన గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రెండు దశాబ్దాల క్రితం ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి కర్కల్ పహాడ్ నుంచి ఎక్వాయిపల్లి, ముద్విన్ మీదుగా చరికొండ వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అప్పట్లో నిర్మించిన రోడ్డు పూర్తిగా పాడై పోవడంతో రోడ్డు మరమ్మతు, ఆధునీకరణకు 2024లో పదిహేను కిలోమీటర్ల రోడ్డును మూడు బిట్లుగా విభజించి టెండర్లు పిలిచారు. రూ.91లక్షలతో కర్కల్ పహాడ్ నుంచి ఎక్వాయిపల్లి వరకు 5కిలోమీటర్ల రోడ్డుకు మరమ్మతు చేశారు. ఎక్వాయిపల్లి నుంచి ముద్వి న్, ముద్విన్ నుంచి చరికొండకు రెండు బిట్లకు రూ.1.95 కోట్లు నిధులు మంజూరుచేసి టెండర్లు నిర్వహించినా నిధులు విడుదల కాకపోవడంతో పనుల నిర్వహణకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. మరమ్మతులు, విస్తరణ పను లు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



ఎక్వాయిపల్లి నుంచి ముద్విన్ మీదుగా చరికొండ వెళ్లే బీటీ రోడ్డు మరమ్మతు, ఆధునీకరణ గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. పది కిలోమీటర్ల మేర రోడ్డు పూర్తిగా పాడై వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై అనేక చోట్ల గోతులేర్పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డును ఆధునీకరించి డబుల్ రోడ్డుగా విస్తరించాలి.

- వినోద్, ముద్విన్

చర్యలు తీసుకుంటున్నాం



పాడైన ఎక్వాయిపల్లి-చరికొండ రోడ్డు మరమ్మతుకు చర్యలు తీసుకుంటున్నాం. మంజూరైన నిధుల విడుదలకు అధికారులకు నివేదించాం. నిధులు కేటాయించిన వెంటనే టెండర్లు నిర్వహించి పనులు చేపట్టడతాం. పాడైన రోడ్డుపై ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక మరమ్మతుల గురించి అధికారులకు నివేదిస్తాం. వాహనదారుల ఇబ్బందులు తొలగిస్తాం.

- వరమేశ్, ఏఈ, కడ్తాల్

నిరుపయోగంగా డంప్‌యార్డులు

(5వ పేజీ తరువాయి)





నందిగామ మండలం కేంద్రంలో నిరుపయోగంగా కంపోస్ట్‌యార్డు, పగులగొట్టిన బీరుసీసాలు

మినహా మిగతా కంపోస్ట్‌యార్డులు నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. వీటిని అధికారులు వాడుకలోకి తీసుకొస్తే గ్రామ పంచాయతీలకు ఆదాయం వచ్చేది. ఒకటి రెండు కేంద్రాల్లో అప్పుడప్పుడు వర్మీ కంపోస్ట్ ఎరువు తయారు చేసి గ్రామ పంచాయతీ నర్సరీలు, హరితహారంలో నాటిన మొక్కలకు వాడుతున్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ రెండు చెత్త బుట్టలను అందజేశారు. పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా పారిశుధ్య సిబ్బంది తడి, పొడి చెత్తను వేరు చేసి కంపోస్ట్‌యార్డులకు చేర్చాలి. అక్కడ తయారైన వర్మీ కంపోస్టును అమ్మడం ద్వారా పంచాయతీలకు సంపద సమకూరుతుంది. ఈ ప్రక్రియ మొదట్లో బాగానే ఉన్నా రానురాను గ్రామంలో సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డులకు తరలించడంలోనూ నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన తొట్టెలు, షెడ్లు నిరుపయోగంగా మారుతున్నాయి.

ప్రజల్లోనూ పట్టింపేదీ?

డంపింగ్ యార్డులు ఊరికి దూరంగా ఉండడంతో సేకరించిన చెత్తను తరలించడంలో పంచాయతీ సిబ్బంది బద్ధకిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. తడి, పొడిచెత్తను వేరుచేసి ఇవ్వాలని అవగాహన కల్పించినా ప్రజల్లోనూ చైతన్యం రావడంలేదనే విమర్శలున్నాయి. దీంతో కంపోస్ట్ కేంద్రాలు నిరుపయోగంగా మారడమే కాకుండా మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రజల్లో చైతన్యం కల్పించాలి



గ్రామాల్లో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. అధికారులు ప్రజల్లో చైతన్యం కల్పించి తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ సిబ్బందికి అందజేసేలా చూడా లి. ఎరువుల తయారీ ద్వారా వచ్చే ఆదాయంతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించవచ్చు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

- కృష్ణ, వీర్లపల్లి



ఎమ్మెల్యే శంకర్‌కు చెక్కును ఇస్తున్న రవికుమార్ అగర్వాల్

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి

షాద్‌నగర్ అర్బన్, మే 2(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీ అభివృద్ధికి చేపడుతున్న పనులు సజావుగా పూర్తి చేయడానికి ప్రతీఒక్కరు సహకారం అందించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ కోరారు. మున్సిపాలిటీలోని 9వ వార్డులో రూ.10 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణ పనులను, 22వ వార్డులో మరో రూ.10లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కమిషనర్ సునిత, మార్కెట్ కమిటీ చైర్మన్ బాబర్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్లు నరేందర్, విశ్వం, కౌన్సిలర్లు ప్రతాప్‌రెడ్డి, సరితయాదగిరియాదవ్, కాంగ్రెస్ నాయకులు కొంకళ్ళ చెన్నయ్య, బస్వం, పి.శ్రీశైలంగౌడ్, ఎస్‌డి ఇబ్రహీం, అందె మోహన్, రాజేందర్‌రెడ్డి, ముబారక్‌అలీఖాన్, నలమోని శ్రీధర్, సుదర్శన్, మన్నె రవి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు. దాతల సహకారంతో చేపట్టిన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణం కోసం రవి ఫ్రూట్స్ అధినేతలు రవికుమార్ అగర్వాల్, కేదార్‌నాథ్ అగర్వాల్, రాజేందర్‌కుమార్ అగర్వాల్‌లు రూ.11లక్షల చెక్కును విరాళంగా ఇచ్చారు. ఎమ్మెల్యే శంకర్‌ను హైదరాబాద్‌లోని ఆయన ఆఫీసులో కలిసి అందజేశారు.

క్రైం కార్నర్

ప్లాట్ ఇప్పిస్తానని నమ్మించి.. రూ.5.60 లక్షలు అపహరణ

- ఇద్దరు నిందితుల అరెస్ట్, రిమాండ్
- రూ.2.70 లక్షలు, 2 సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్



స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు

షాద్‌నగర్ రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): ప్లాట్ ఇప్పిస్తానని నమ్మించి హైదరాబాద్ నుంచి షాద్ న గ ర్ కు రప్పించి రూ.5.60 లక్షలు అపహరించిన నిందితులను శుక్రవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. షాద్‌నగర్ పట్టణంలోని సాయిప్రియ కాలనీలో నివాసముండే చింతోజు శ్రీధర్(33) గత నెల 27న హైదరాబాద్‌కు చెందిన రొయ్యల మల్లేష్ అనే వ్యక్తికి ఫోన్‌చేసి విర్యాల శివారులోని సువర్ణ కుటీర్‌లో ప్లాట్ ఇప్పిస్తానని చెప్పి రప్పించాడు. మల్లేష్ తన కారులో రూ.5.60 లక్షలు తీసుకొని షాద్‌నగర్ వచ్చాడు. షాద్‌నగర్‌లో మల్లేష్ కోసం ఎదురు చూస్తున్న చింతోజు శ్రీధర్, అతడి స్నేహితుడు నాగేశ్వరపు శ్రీధర్‌లు మోటార్ సైకిల్‌పై ముందు వెళ్తుండగా కారులో మల్లేష్, అతడి స్నేహితుడు అనుసరిస్తూ వెళ్లారు. సువర్ణ కుటీర్ వెంచర్‌లోకి వెళ్లగానే రాళ్లతో మల్లేష్ కారు అద్దాలు పగులగొట్టి బెదిరింపులకు గురిచేశారు. అనంతరం వారి వద్ద ఉన్న రూ.5.60లక్షలు తీసుకొని పారిపోయారు. అదే రోజు బాధితులు షాద్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకుని నిందితులు చింతోజు శ్రీధర్, అతడి స్నేహితుడు నాగేశ్వరపు శ్రీధర్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. నిందితుల నుంచి రూ.2.70 లక్షల నగదు, రెండు సెల్ ఫోన్లు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు.. వ్యక్తి మృతి

ఆదిభట్ల, మే 2(ఆంధ్రజ్యోతి): ఓఆర్ఆర్‌పై అతివేగంతో కారు డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో యువకుడు మృతిచెందిన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్‌రోడ్‌పై శుక్రవారం చోటుచేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం మేరకు.. యాచారం మండలం, నల్లవెల్ల గ్రామానికి చెందిన దండుగుల తిరుమలేష్(35), భార్య శివాని, ఇద్దరు పిల్లలతో కలిసి గచ్చిబౌలిలో నివాసముంటూ వాటర్ మ్యాన్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం పనిమీద బ్రెజా కారులో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి నుంచి బొంగ్లూర్ వైపుకు వెళ్తున్నాడు. ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెంబర్ 12 వద్ద కారు అదుపు తప్పిడంతో డివైడర్‌ను ఢీకొట్టాడు. దాంతో కారు బోల్తా పడటంతో తిరుమలేష్ రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఓఆర్ఆర్ పెట్రోలింగ్ సిబ్బంది ఆదిభట్ల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసున్నట్లు సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

షాబాద్, మే 2(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ యువకుడు పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై సతీష్ కథనం మేరకు.. రుద్రారం గ్రామానికి చెందిన జట్ట సంగమేశ్వర్(22) 15 సంవత్సరాల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ అనేక ఆసుపత్రుల్లో చికిత్స తీసుకున్నాడు. సంగమేశ్వర్ తండ్రి నర్సింలు బుధవారం మొయినాబాద్ మండల పరిధిలోని భాస్కర్ ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇంటికి తీసుకెళ్లాడు. అయితే, ఎంతకూ ఆరోగ్యం బాగుపడకపోవడంతో తీవ్ర మానసిక వేదనకు గురైన సంగమేశ్వర్ గురువారం పొలానికి వెళ్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి నర్సింలు పొలం వద్దకు వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఫర్టిలైజర్ షాప్‌పై చీటింగ్ కేసు

షాబాద్, మే 2(ఆంధ్రజ్యోతి): విక్రయిస్తున్న రసాయన మందులకు సరైన రశీదులు లేనందున నాగర్‌గూడలోని న్యూ మారుతి ఫర్టిలైజర్ దుకాణంపై శుక్రవారం షాబాద్ పోలీస్‌లు చీటింగ్ కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని నాగర్‌గూడ గ్రామంలో న్యూ మారుతి సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ దుకాణంలో సింజెంటా కంపెనీకి చెందిన సీనోడిన్ మందును అదే కంపెనీకి చెందిన వ్యక్తి పుట్ట రాకేష్ కొనుగోలు చేసి కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ కేశవ సుధీర్‌కు పంపించాడు. రసాయన మందు డబ్బాపై ప్రింటింగ్‌లో తేడాలను గమనించిన ఆయన న్యూమారుతి సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశాడు. సింజెంటా కంపెనీకి చెందిన రసాయన మందులకు సంబంధించిన బిల్లు(రషీదు) సరిగా లేనందున ఆయనపై షాబాద్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. పోలీస్‌లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీలక్ష్మిని సన్మానించి స్వీట్ తినిపిస్తున్న వసంత

విద్యార్థినికి సన్మానం

కందుకూరు, మే 2(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో కందుకూరు, మహేశ్వరం మండలాల పరిధిలో మొదటి ర్యాంక్ సాధించిన కొత్తూరుకు చెందిన వేముల కృష్ణ, అనిత దంపతుల చిన్న కుమార్తె శ్రీలక్ష్మిని కొత్తూరు మాజీ సర్పంచ్ పల్లె వసంత, కందుకూరు వైస్ ఎంపీపీ పల్లె కృష్ణగౌడ్‌లు సన్మానించారు. ఇటీవల విడుదలైన టెన్త్ ఫలితాల్లో 600 మార్కులకు గాను 585 సాధించి రెండు మండలాల్లో మొదటి ర్యాంకులో నిలిచింది. రంగారెడ్డి జిల్లాలో రెండో ర్యాంకు సాధించింది. ఈమేరకు శుక్రవారం శ్రీలక్ష్మిని కొత్తూరు గ్రామంలో వారు సన్మానించారు. తుక్కుగూడలోని దేవేంద్ర విద్యాలయంలో విద్యాభ్యాసం చేసిన శ్రీలక్ష్మి ఉత్తమ ఫలితం సాధించడం పట్ల అభినందించారు. నాయకులు పి.శేఖర్, ఎ.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్.. పేదలకు వరం

ఆమనగల్లు, మే 2(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేదలకు వరంగా నిలుస్తుందని కేఎన్ఆర్ సేవా దళం వ్యవస్థాపక అధ్యక్షులు మెకానిక్ బాబా, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఫరీద్, కేఎన్ఆర్ యువసేన జిల్లా అధ్యక్షుడు విజయ్‌రాథోడ్‌లు అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ గుర్రంగుట్ట కాలనీకి చెందిన పల్లె ఈశ్వరమ్మకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో రూ.24 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. శుక్రవారం ఆమనగల్లు పట్టణంలో బాధిత కుటుంబానికి బాబా, ఫరీద్, విజయ్ రాథోడ్‌లు చెక్కును అందజేశారు. చుక్క వెంకటయ్య, పరమేశ్, కొండల్‌రెడ్డి, శ్రీనునాయక్, సలీం, తదితరులున్నారు.

కులగణన నిర్ణయం.. చరిత్రాత్మకం



ఆమనగల్లు : బాణసంచా కాలుస్తున్న బీజేపీ నాయకులు

ఆమనగల్లు, మే 2(ఆంధ్రజ్యోతి): దేశంలో జనగణనతో పాటు కులగణన చేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి అన్నారు. దేశంలో 48 ఏళ్ల అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఏనాడూ బీసీల జనగణన చేపట్టకుండా వారిని అణచివేతకు గురిచేసిందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కుల గణన చేపట్టాలని మోదీ నాయకత్వంలోని కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ ఆమనగల్లు పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం పెద్ద ఎత్తున సంబురాలు జరుపుకున్నారు. స్థానిక హైదరాబాద్-శ్రీశైలం రహదారిపై బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు ఎర్రవోలు శ్రీనుల ఆధ్వర్యంలో మాజీ జడ్పీటీసీ కండె హరిప్రసాద్, బీజేపీ నాయకులతో కలిసి ఆచారి మోదీ చిత్రపటానికి పాలాభి, పుష్పాభిషేకం చేశారు. బాణసంచా పేల్చి బీజేపీ, మోదీకి అనుకూలంగా నినాదాలు చేశారు. బీజేపీ జిల్లా, మండల నాయకులు గోరటి నర్సింహ, చెక్కాల లక్ష్మణ్, రాంపాల్‌నాయక్, దుర్గయ్య, మొక్తాల వెంకటయ్య, చెన్నకేశవులు, శ్రీశైలం యాదవ్, సుండూరు శేఖర్, మేడిశెట్టి శ్రీధర్, రవిరాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

యాచారం : దేశంలో కులగణనకు కేంద్ర ప్రభుత్వం పూనుకోవడం అభినందనీయమని బీజేపీ యాచారం మండల నాయకులు ఆర్.విజయ్‌కుమార్ అన్నారు. ఈమేరకు నందివనపర్తిలో మోదీ చిత్రపటాలనికి పాలాభిషేకం చేశారు. బీజేపీ నాయకులు గోగికార్ రమేష్, మధుకర్ యాదవ్, శివాజీ, కె.రాజ్‌కుమార్, శ్రీనివాస్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ రూరల్ : దేశవ్యాప్త కులగణన చేపట్టడం చరిత్రాత్మక నిర్ణయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందె బాబయ్య తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్దలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. దేశవ్యాప్తంగా నిజమైన కులగణన చేపట్టాలని మోదీ నిర్ణయించారని చెప్పారు. కాంగ్రె స్‌కు పేదల కష్టాలపై శ్రద్ధ లేదని, ఓట్లు, కుటుంబమే వాళ్లకు ముఖ్యమన్నారు. వెంకటేశ్ గుప్త, అ శోక్, ప్రశాంత్, కురుమయ్య తదితరులు ఉన్నారు.



యాచారం : నందివనపర్తిలో మోదీ చిత్రపటానికి నాయకుల పాలాభిషేకం



షాద్‌నగర్ రూరల్ : ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ముమ్మరంగా వరి కోతలు

(5వ పేజీ తరువాయి)

మంతన్‌గౌరెల్లి, ఇబ్రహీంపట్నం. దండుమైలారం, మంచాల, బోడకొండ, తొర్రూరు. గౌరెల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలకు ఇప్పుడిప్పుడే ధాన్యం వస్తోంది. ఏగ్రేడ్ రకం ధాన్యానికి రూ.2,320, బి గ్రేడ్ ధాన్యానికి రూ.2,300 ఇస్తున్నారు. ఆయా కేంద్రాల్లో వర్షం కురిస్తే ధాన్యాన్ని కాపాడుకోవడానికి ఎలాంటి వసతులు లేకపోవడం, గన్నీ బ్యాగులు సరిపోను లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పొలాల వద్ద ధాన్యం ఆరబోసి కేంద్రాలకు తరలిస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకనుగుణంగా ధాన్యం నిల్వ చేసుకునేందుకు గిడ్డంగులు లేకపోవడంతో ధాన్యం తడిసి రైతులు నష్టపోతున్నారు. సాగుకు పెట్టుబడులు పెరిగినందున ఏ గ్రేడ్ రకానికి రూ.2,500, బి గ్రేడ్ రకానికి రూ.2,400 చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

రైతులకు మద్దతు ధర ఇస్తున్నాం



మద్దతు ధరతో ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నాం. కొన్న వారం రోజుల్లోనే రైతుల ఖాతాలో డబ్బు జమ అయ్యేటట్లు చర్యలు తీసుకుంటున్నాం. ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలి. ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోవద్దు.

- సుజాతరెడ్డి, డివిజన్ వ్యవసాయాధికారి

చకచకా కొనుగోళ్లు

- ధాన్యంతో నిండుగా ఆమనగల్లు మార్కెట్

ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌కు రోజుకు వెయ్యి బస్తాల చొప్పున ధాన్యం వస్తోంది. దీంతో ధాన్యంతో మార్కెట్ ఆవరణ నిండిపోయింది. ఆరబోసిన ధాన్యం అకాల వర్షాలతో తడిసిపోతుందేమోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వరికి మద్దతు ధరతో పాటు సన్నాలు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించడంతో నియోజకవర్గంలోని మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల, ఆమనగల్లు మండలాల్లో ఈ ఏడాది యాసంగిలో వరిని అధికంగా సాగు చేశారు. ఆమనగల్లు మండలంలో 5,580, తలకొండపల్లిలో 5,600, కడ్తాలలో 4,000, మాడ్గులలో 5,300 ఎకరాల్లో వరి సాగు సాగైనట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. డివిజన్ పరిధిలో 4.30 లక్షల క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు.

6752 బస్తాల ధాన్యం సేకరణ..

ఆమనగల్లు మార్కెట్ యార్డులో ఏప్రిల్ 18న పౌరసరఫరాల శాఖ సహకారంతో తలకొండపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయగా స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ప్రారంభించారు. ఇప్పటివరకు 35 మంది రైతుల నుంచి 3,777 బస్తాల దొడ్డు వడ్లు, 40 మంది రైతుల నుంచి 2,975 బస్తాల సన్న వడ్లు కొనుగోలు చేసినట్లు పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, సీఈవో ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లకు తరలిస్తున్నట్లు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

చేవెళ్ల, మే 2(ఆంధ్రజ్యోతి): నేడు (శనివారం) చేవెళ్ల పట్టణ కేంద్రంలో సీఎం సహాయనిధి, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ బి.కృష్ణయ్య ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉదయం 9:30 గంటలకు ఎమ్మెల్యే యాదయ్య లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయనున్నారని, లబ్ధిదారులు సకాలంలో హాజరుకావాలని పేర్కొన్నారు.

నూతన సీఎస్‌ను కలిసిన సత్యనారాయణరెడ్డి



చేవెళ్ల, మే 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నూతన చీఫ్ సెక్రటరీగా నియమితులైన రామకృష్ణారావును రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు శుక్రవారం నగరంలోని బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో ఆయన్ను కలిసి పూల బొకేను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనతో పలువురు నాయకులున్నారు.

లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులకు సన్మానం



కడ్తాల్, మే 2(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు లయన్స్‌క్లబ్ 2025-26 సంవత్సరానికి నూతన అధ్యక్ష, కార్యదర్శిగా ఎన్నికైన కె.గోవర్దన్ రెడ్డి, గంప శ్రీనులను శుక్రవారం కడ్తాల మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. పూలమాలలు, శాలువాలతో వారిని సత్కరించి అభినందించారు. లయన్స్‌క్లబ్ సేవలను మరింత గా విస్తరిస్తామని గోవర్దన్‌రెడ్డి, శ్రీనులు తెలిపారు. నాయకులు పోతుగళ్ల మహేశ్, మంగళపల్లి నర్సింహ, గురిగళ్ల రామచంద్రయ్య, సిద్దిగారి వెంకటేశ్, సిద్దిగారి దాసు, కృష్ణ, సురేశ్, మహేశ్, రాములు, రాజేశ్, వేణు, అంజి, తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో గుండెపోటుతో వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో వ్యక్తి మృతి చెందిన ఘటన శంషాబాద్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని గోల్కొండకు చెందిన ఆజాద్(47) గురువారం తన కూతురు తలాత్ స్రీన్ బీదర్‌లోని షాహీన్ యూనివర్సిటీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కూతురిని బీదర్‌లో వదిలిపెట్టేందుకు వెళ్లిన ఆజాద్ తిరుగు ప్రయాణంలో ఇండిగో విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడు. ఎయిర్‌పోర్టులో ఒక్కసారిగా కిందపడిపోవడంతో గమనించిన స్థానికులు వెంటనే అపోలో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు సజ్జద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, తన అన్న ఆజాద్ గుండెపోటుతో లేదా అనారోగ్యంతో మృతిచెంది ఉంటాడని సజ్జద్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

పార్కుల అభివృద్ధికి రూ.3 కోట్లు మంజూరు

- ఆదిభట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ

ఆదిభట్ల, మే 2(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని పార్కుల అభివృద్ధికి కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ టీకే శ్రీదేవి రూ.3 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు కమిషనర్ ఎస్.బాలకృష్ణ ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను వసూలులో ముందంజలో ఉన్నందుకు కన్సిస్టెంట్ అచీవర్స్ అవార్డు పొందినట్లు పేర్కొన్నారు. అందుకు గుర్తింపుగా పార్కుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరగా మంజూరు చేసినందుకు టీకే శ్రీదేవికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని, పార్కులను అందరి సహకారంతో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.